batukammanews.com
TEL/2019/78873
# బతుకమ్మ
తాజా వార్తల సద్దిమూట
29 సెప్టెంబర్ 2026
మంగళవారం

## లంచం తీసుకుంటూ
# ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

వ్యవసాయ భూమికి సంబంధించిన పంచనామా నివేదికను తహసీల్దార్ కు సమర్పించడం కోసం ఆర్ఐ రూ.15 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కారు.

– నల్గొండ, బతుకమ్మ



2 లో

# మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడిలో



కార్పొరేషన్ బడ్జెట్ లో కోట్ల కేటాయింపు . . .
పనులు మాత్రం శూన్యం
మున్సిపల్ కార్పొరేషన్ అవినీతికి కేరాఫ్ గా మారింది
అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

2 లో

# ఉద్రిక్తత




నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్ లో కేటాయింపులు కోట్లలో ఉండగా పనులకు మాత్రం రూపాయి ఖర్చు చేయడం లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ విమర్శించారు. నిజామాబాద్ బల్దియా అవినీతికి కేరాఫ్ గా మారిందని ఆరోపణలు చేశారు. సోమవారం నగరంలోని ధర్నా చౌక్ లో బీజేపీ బల్దియా పోరు ఉద్యమం చేపట్టింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడించారు. పోలీసులు బీజేపీ నాయకులను కార్పొరేషన్లను రానివ్వకుండా భారీకేడ్లను పెట్టినా వాటిని తోసివేసి కార్పొరేషన్ కార్యాలయంలోకి దూసుకెళ్లారు.

– నిజామాబాద్ సిటీ, బతుకమ్మ



## ప్రభుత్వ తీరుతో
## తెలంగాణ మెడికల్ విద్యార్థులకు
# నష్టం

ప్రభుత్వం తెచ్చిన జీవోను రద్దు చేయాలి
తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



2 లో

మెడికల్ సీట్లలో స్థానికత మార్చే విధంగా ప్రభుత్వం తెచ్చిన జీవోలు 33, 150ల కారణంగా పెను ప్రమాదం పొంచి ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఈ జీవోలతో తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతుందని, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు మేలు జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం చేసే ఇలాంటి జీవోలను రద్దు చేయాల్సింది పోయి సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున అడ్వకేట్ దాన్ని డిఫెండ్ చేయటమేమిటనీ ప్రశ్నిస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

– హైదరాబాద్, బతుకమ్మ

## చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను
# పదవి నుంచి తొలగించాల్సిందే

- నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆందోళన
- సీఈసీ దిష్టిబొమ్మ దహనం
- సీఈసీపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

2 లో



## తెలంగాణలో కొత్తగా మరో
# 41 బార్లకు అనుమతి



2 లో

తెలంగాణలో కొత్తగా 41 బార్లకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, దాని సమీప గ్రామాలను పరిగణలోకి తీసుకుని బీ2 కింద కొత్త బార్ల లైసెన్స్ మంజూరికి ఉత్తర్వులు ఇచ్చింది. క్యూర్ పరిధిలో 14, ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 27 బార్లను కేటాయించింది. సోమవారం నుంచి అక్టోబర్ 12 వరకు ఎక్సైజ్ కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరిస్తున్నారు.

– హైదరాబాద్, బతుకమ్మ



2 లో

## అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా
# నమోదు చేసుకోవాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం హైదరాబాద్‌లో తన ఓటును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఎన్నికలు జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా ఓటరు నమోదును పూర్తి చేయాలని కోరారు.

– హైదరాబాద్, బతుకమ్మ

# సీఎం రేవంత్ రెడ్డి ప్లేక్సికి పిండ ప్రదానం చేసిన ఎంఆర్పిఎస్

### పీసీసీచీఫ్ పదవికి మహేష్ కుమార్ గౌడ్ రాజీనామా చేయాలి

### వీడీసీ ఆగడాలపై ఆర్మూర్‌లో వినూత్న నిరసన

ఆర్మూర్, బతుకమ్మ:ఏర్గట్ల మండలంతాళ్ల రాంపూర్ గ్రామంలో ఈ నెల 22న 39 గీత కార్మిక గౌడ కుటుంబాలను,10 ఎస్సీ కుటుంబాలనుసాంఘిక బహిష్కరణ చేయడం పై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నిరసన తెలిపారు. విడిసీల అగడాలనునియంత్రించడంలో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఎమ్మార్పీఎస్ఆధ్వర్యంలో సీఎం ప్లేక్సి పిండ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ ఆర్మూర్ఇంచార్జ్ మైలారం బాలు మాదిగ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చిత్రపటానికి రేవంత్ గౌడ్ అనిఎందుకు పెట్టాం అంటే మొన్న హైదరాబాద్ లో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరణ లోఎంఎల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మా సీఎం రేవంత్ గౌడ్ అనిమాట్లాడినారు.సీఎం ను గౌడ్లతో పిలిచిన మీరు మీ సొంత జిల్లా లో గౌడ కులస్తులను, ఎస్సీలను సాంఘిక బహిష్కరణ చేస్తే మీరు మీ ప్రభుత్వం ఉండి కూడా దండగ అని తక్షణంసాంఘిక బహిష్కరణకు బాధ్యత వహించాలని మీరు రాజీనామా చేయాలని ఎంఆర్పీఎస్ పక్షానడిమాండ్ చేశారు. గౌడ కులస్తులను సాంఘిక బహిష్కరణ చేస్తే మీప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు ఉంది అని గౌడ కులస్తులు ప్రభుత్వం మీదపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గౌడ కులస్తులకు ఎంఆర్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగఅండగా ఉంటారని తెలియజేస్తున్నాం అన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ లు రజాకార్లనుతలపిస్తున్నాయి అని తక్షణం గ్రామాభివృద్ధి కమిటీ లను అణిచివేయాలని లేని యెడలఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకెళ్తాం ప్రత్యక్షకార్యాచరణ ద్వారా ఉద్యమాన్ని కొనసాగిస్తాం అన్నారు. గౌడ కులస్తులు వినతి



పత్రాలుకాకుండా సర్వాయి పాపన్న గౌడ్ వారసులు గా ఉద్యమాలను కొనసాగించాలని కోరారు. 24 గంటల్లోబహిష్కరణ ఎత్తి వేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తరుణ్, కిరణ్, మార్క్ అశోక్, విప్లవ్,సాయన్న, బోట్లగంగరం, వరుణ్ తదితరులు పాల్గొన్నారు

# మంద కృష్ణ మాదిగను కలిసిన తాళ్ళరాంపూర్ విడిసీ బాధితులు

### విడిసీల రద్దు కోసం ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుంది అని హామీ

నిజామాబాద్, బతుకమ్మ: వీడీసీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మంద కృష్ణ తాళ్ల రాంపూర్" గ్రామ అభి వృద్ధి కమిటీ" బాధితులు కలిసారు. సోమవారం హైదరాబాద్ లో మంద కృష్ణ ను కలిసిన విడిసీ బాధితులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ అన్ని ప్రజాస్వామిక సంఘాల ద్వారాఇట్టి సమస్య పరి ష్కార దిశగా మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కాలంలో కూడా ఇలాంటి సాంఘిక బహిష్కరణ వంటి దురాగతాలుజరగడం సిగ్గుచేటు అని అన్నారు. వారి ఆధిపత్య కుల అహంకార ధోరణి కూకటివేళ్లతోఅని చేస్తాం.. బాధితులకు అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు





సరికేల పోశెట్టి మాదిగ మాట్లాడుతూ త్వరలో వీడీసీ వ్యతిరేక పోరాట సమితి తోఉద్యమం చేస్తాం అన్నారు. నిజా మాబాద్ జిల్లా నుండి అధికార పార్టీ నుండి పీసీసీ అధ్యక్షుడు హోదాలో మహేష్కుమార్ గౌడ్ వుండి తన సామాజిక వర్గం వారిని ,దళితుల సాంఘిక బహిష్కరణ చేయడంసిగ్గుచేటు అన్నారు. పీసీసీ చీఫ్ హోదాలో నిజామాబాద్ లో ఉండిపరా మర్శించకపోవడం మరి వారిపై చట్టరీత్యా చర్య తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈకార్య క్రమంలో బట్టు శ్రీధర్, బాదితులు దిబ్బ సుదర్శన్ , నర్సా గౌడ్ , నారాయణ గౌడ్ , గంగాధర్ , దేవదాస్ , దేవన్న , జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిని పగలు తిడతాడు ,రాత్రి పోయి పొర్లు దండలు పెడతడు

### అరవింద్ ఎంపీ గా గెలవడం నిజమాబాద్ జిల్లా దురదృష్టం

### నిజామాబాద్ కు నయాపైసా తేలేని ఎ చేతకాని దద్దమ్మ

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అంటేనే హాఫ్ నాలెడ్జి అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అహంకారం, అవినీతి, అబద్దానికి ఆంగి లాగు తొడిగితే అది అరవింద్ అసలు రూపమని ఎద్దేవా చేశారు. అయ్యపేరు చెప్పుకుని 2004 లో కాంగ్రెస్ బీ ఫామ్ లు అమ్ము కున్న అవినీతి బాగోతాలు అరవింద్ మూటగట్టుకున్నాడని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని పగలు పొట్టోడు అని తిడతాడు, రాత్రి పోయి పొర్లు దండలు పెడతాడని ఆయన వ్యాఖ్యానించారు. అరవింద్ ఎంపీ గా గెలవడం



నిజమాబాద్ జిల్లా దురదృష్టమన్నారు. బనకచర్లను జనకచర్ల అనే అజ్ఞాని అరవింద్ అని, నిజామాబాద్ కు నయాపైసా తేలేని చేతకాని దద్దమ్మ అని, అలాంటి చవట సన్నాసి అరవింద్ కు రాష్ట్రం తెచ్చిన కేసీఆర్ గురించి మాట్లాడే స్థాయి ఉందా అని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. రేవంత్ పేటీఎం బ్యాచ్ సభ్యుడు అరవింద్ అని, కాంగ్రెస్ తో పోరాడే శక్తి లేక కేసీఆర్ ను తిడుతుండు అని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమం లో అరవింద్ పాత్ర అణా పైసా కూడా లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై ఇంకెంత కాలం విషం కక్కుతారని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలకు, రోత మాటలకు అరవింద్ అడ్డాగా మారిందని ఆయన విమర్శించారు. అరవింద్ ఇల్లు, అతడి కుటుంబమే అవినీతి, అబద్ధాల పునాదులపై పుట్టిందన్నారు. నీ అయ్య కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ అని, నువ్వే ఒక చార్లెస్ శోభరాజ్ వి, నీ పార్టీకి చెందిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఒక దావూద్ ఇబ్రహీం అని జీవన్ రెడ్డి మండిపడ్డారు. అరవింద్ ఒక డ్రగ్స్ స్మగ్లర్ అని, రాకేష్ రెడ్డి ఒక ఎర్ర చందనం?దొంగ, బంగారం స్మగ్లర్ అని ఆయన ఎద్దేవా చేశారు. పసుపు బోర్డు ఎక్కడుందో అరవింద్ చెప్పాలని, అరవింద్ రైతు ద్రోహి అని, ధర్మపురి కుటుంబమే పెద్ద యమపురి అని ఆయన అన్నారు.తెలంగాణ ఉద్యమంలో అరవింద్ కుటుంబం ఎక్కడుందని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మౌత్ స్పీకర్ గా అరవింద్ మారాడని ఆయన పేర్కొంటూ కేసీఆర్ ఫ్యామిలీని విమర్శించే స్థాయా నీదిఅని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు, సత్యప్రకాష్, లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు నదీమ్,పృథ్వీ, అజీమ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాధర్, రంజిత్, అభిలాష్, మల్లారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లు ఆయమ్మల సేవలు అభినందనీయం

జుక్కల్ , బతుకమ్మ : మండలంలోని లాడేగావ్ గ్రామ ఎస్సీ వాడ అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూల్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్ మిలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలను సన్మానించారు. కామారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా కో-ఇన్‌చార్జి రాథోడ్ సునీత మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్య కోసం అంగన్‌వాడీ టీచర్లు??ఆయమ్మలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వారి సేవలను గుర్తించి సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలాజీ పటేల్, బుడాల గంగరాజు, సంబాజీ పటేల్తో పాటు గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.



# ప్రజావాణికి 100 ఫిర్యాదులు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మానికి 100 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటిక ప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జిల్లా రెడ్ క్రాస్ కమిటీ చైర్మన్ కు ఘన సన్మానం



పిట్లం, బతుకమ్మ : ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్టేట్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ సార్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాయిలు సార్ సూచన మేరకు మండల కేంద్రమైన పిట్లం బ్లూ బెల్స్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా చైర్మన్ సంజీవ రెడ్డి గారికి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ పిట్లం మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ మాట్లాడుతూ.. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ చైర్మన్ గా పిట్లం కు చెందిన ఎం. సంజీవ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. "రెడ్ క్రాస్ సొసైటీ సేవా భావంతో పనిచేసే గొప్ప మానవతా సంస్థ అని ఆన్నారు. కామారెడ్డి జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించి, ఆపదలో ఉన్న వారికి, పేదలకు, అనాథలకు, వృద్ధులకు మరియు అవసరమైన ప్రతి ఒక్కరికీ అండగా నిలవాలని కోరారు. అదేవిధంగా రక్తదాన కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, గ్రామస్థాయిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు తక్షణ సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ రెడ్ క్రాస్ సొసైటీకు నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొఫెషన్ కౌన్సిల్ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ పిట్లం మండల ఉపాధ్యక్షుడు దత్తు, ప్రధాన కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత..

కమ్మర్ పల్లి,బతుకమ్మ :మోర్తాడ్ గ్రామానికి చెందిన చిన్నారి రియా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెల్సిందే ఐతే చిన్నారికి ఆపరేషన్‌తో పాటు వైద్య చికిత్స కోసం సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు.చిన్నారి రియా అనారోగ్య పరిస్థితిని వివరిస్తూ సోషల్ మీడియా, పత్రికల ద్వారా దాతల సహాయం కోరారు. ఈ క్రమంలో పత్రికలో ప్రచురితమైన చిన్నారి రియా పరిస్థితిపై వచ్చిన కథనాన్ని చదివి చలించి దుబాయ్‌లో ఉంటున్న బషీరాబాద్‌కు చెందిన బొక్కెన శంకర్ తనవంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు.రియా చికిత్సకు తన వంతు సాయంగా రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని తన మిత్రులు బైకని మహేష్, గుండోజి నాగేంద్ర చేతుల మీదుగా సోమవారం అందజేశారు. చిన్నారి చికిత్సకు తన వంతు సహాయం చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా రియా కుటుంబ సభ్యులు, గ్రామ యువకులు బొక్కెన శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి రియా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆర్థికంగా స్థోమత ఉన్న దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన సహాయం అందించాలని కోరారు.



## సమాజంలో పాత్రికేయుల సేవలు వెలకట్టలేనివి...

– సయ్యద్ ముల్తానీ టి ఎమ్ హెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు...



రుద్రూర్, బతుకమ్మ : సమాజంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పాత్రికేయుల సేవలు వెలకట్టలేనివని తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సయ్యద్ ముల్తానీ అన్నారు. నూతనంగా ఏర్పడ్డ రుద్రూర్ ప్రెస్ క్లబ్ సభ్యులకు, పాత్రికేయులకు సోమవారం శాలువా పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరిగే మంచి చెడులను, వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిలా నిలిచి బాధితుల సమస్యలను వెలుగులోకి తీస్తు ప్రజా గొంతుకగా నిలుస్తున్నారని అన్నారు. విపత్కర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సమాజ స్థితిగతులపై ప్రజలను చైతన్య పరిచింది జర్నలిస్టులే అని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో రుద్రూర్ విలేజ్ ముస్లిం మైనార్టీ కమిటీ కార్యదర్శి షేక్ సుభాని, ఉపాధ్యక్షులు కలీం ఖురేషి, సహాయ కార్యదర్శి కాజా ఖురేషి, కోశాధికారి మొహమ్మద్ ఇక్రమ్, షామిర్ ఖురేషి, ఎండి జమీల్,షేక్ జకీర్, సాదిక్, సమీర్, అఫ్జల్, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో అనర్హుల పేర్ల పై ప్రజావాణిలో ఫిర్యాదు...

– కార్యదర్శి శ్రావణ్ పై చర్యలు తీసుకోవాలి...



రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడతలో మంజూరు చేయదలచుకున్న ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో అర్హుల పేర్లు ఉన్నాయని గ్రామ సర్పంచ్ కుర్లేపు గంగాధర్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ వాళ్లు సర్పంచ్ సంతకం లేకుండానే లిస్టును తయారు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కార్యదర్శి శ్రావణ్ పై తమ విధుల దృష్ట్యా లోపాలను ఫిర్యాదు రూపంలో జిల్లా కలెక్టర్, ఎంపిడిఓ కు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు పట్టించుకోవడం లేదన్నారు. గత 4 సంవత్సరాలుగా ఇక్కడే విధులు నిర్వహిస్తూ రాజకీయ వ్యవహారాలు జరుపుతున్నారని, విషయంపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి..

– అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలి..

– బీఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్...



రుద్రూర్, బతుకమ్మ: రుద్రూర్ మండల కేంద్రంలోని ఆర్ఎన్ సీ కాలనిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను వేంటనే పూర్తి చేసి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలనీ రుద్రూర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్ఎన్ సి కాలనీలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, అర్హులైన నిరుపేదలకు అందిచాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు, బిఆర్ఎస్ పార్టీ సినీయర్ నాయకులు దౌర్ సాయిలు, కొత్తపల్లి రవి కిరణ్, సిరిగాది శేఖర్, పార్వతి ప్రవీణ్, సుమన్, ఆల్లా ఉద్దీన్, ఇందూరి సాయిలు, బండ్ల శేఖర్, సతీష్, వీరన్న, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా ఆంక్షలకు తలొగ్గి ప్రజలపై భారం మోపుతున్న మోదీ ప్రభుత్వం






ఇందూర్, బతుకమ్మ : అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పాలస్తీనా క్యూబా ప్రజల సార్వభౌమత్వ పోరాటాలకు సంఘీభావంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ నిజామాబాద్ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్ సింగ్ జయంతి సభను జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ కామ్రేడ్ భగత్ సింగ్ దృష్టిలో భారతదేశ విముక్తి అనేది మానవ విముక్తికోసం సాగుతున్న విస్తృత పోరాటంలో ఒక భాగంగా చూడాలన్నారు. పాలస్తీనా ప్రజల పోరాటం హక్కులు, స్వేచ్ఛ, స్వయం నిర్ణయాధికారం కోసం జరుగుతున్నదన్నారు. క్యూబా తన సార్వభౌమ త్వాన్ని స్వతంత్ర రాజకీయ మార్గాన్ని కాపాడుకోవడానికి పోరాటం చేస్తుందన్నారు. ఈ రెండు పోరాటాలకు భారత్ ప్రజలు సంఘీభావం తెలపడం అవసరమన్నా రు. భగత్ సింగ్ అంతర్జాతీయ వాదంతో కూడిన జాతీయవాది అని అన్నారు. జాతీయవాదమని చెప్పుకుంటున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిడికి తలొగ్గి వారితో వాణిజ్య ఒప్పందం చేసుకుంద న్నారు. మన వ్యవసాయ రంగానికి ఉరితాళ్లు బిగిస్తున్నదన్నారు. రష్యా ఆయిల్ కొనవద్దని అమెరికా ఆంక్షలకు మోడీ ప్రభుత్వం తలొగ్గిందన్నారు. తద్వారా మన ఆయిల్ ఖర్చు పెరిగి, ప్రజలపై భారం పెరిగిందన్నారు. పాలస్తీనా, ఇరాన్, క్యూబాలపై అమెరికా ఆంక్షలు, దాడులను మోడీ ప్రభుత్వం ఖండించకపోవడం ఇజ్రాయిల్ని పొగడడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. భగత్ సింగ్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట స్ఫూర్తితో పాలస్తీనా క్యూబా, ఇరాన్ లకు సంఘీభావం తెలపాలన్నారు. సభ అనంతరం ప్లకార్డులతో ధర్నా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్ జిల్లా నాయకులు ఎం.వెంకన్న, డి.రాజేశ్వర్, కే.గంగాధర్, కే.గణేష్, వి.గోదావరి, ఎం.నారాయణ,ఎం.సాయిబాబా లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు బి.మల్లేష్, డి.కిషన్, బి.మురళి, కే.సంధ్యారాణి, సాయరెడ్డి, బీక్ సింగ్, అనిల్, నసీర్, సృజన్, భాస్కర స్వామి, ఒడ్డెన్న, నాగమణి, చరణ్, రమేష్, మానస తదితరులు పాల్గొన్నారు

# పారిశ్రామిక వేత్త దయానంద్ రెడ్డి దాతృత్వం

రూ.7 లక్షల విలువైన సామాగ్రి విరాళంగా అందజేత

ముచ్కూర్, ఎర్గట్ల, పచ్చలనడుకుడ గ్రామాల పాఠశాలలకు సైన్స్ ల్యాబ్ మెటీరియల్ అందజేత

భీమ్ గల్ కస్తూరిబా గాంధీ పాఠశాల కు 35 డ్యూయల్ డెస్క్ బెంచ్‌ల పంపిణి.





వేల్పూర్, బతుకమ్మ :బాల్కొండ కానిస్టెన్సీలోని ముచ్కూర్, ఎర్గట్ల, పచ్చలనడ్కూడ గ్రామాల గవర్నమెంట్ హైస్కూళ్లకు ప్రముఖ పారిశ్రామిక వేత్త దయానంద్ రెడ్డి రూ. 7లక్షల విలువైన సైన్స్ లాబ్ మెటీరియల్, డ్యూయల్ డెస్కు విరాళంగా ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకొన్నారు. ఇప్పటి వరకు బాల్కొండ కానిస్టెన్సీ పరిధిలోని పలు గవర్నమెంట్ స్కూళ్లకు తన వంతు విరాళం ఇస్తున్న దయానంద్ రెడ్డి మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి వియ్యంకుడు కాగా ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో పారిశ్రామిక వేత్త ఏనుగు దయానంద్ రెడ్డి సహకారంతో రూ. 1,80,000 రూపాయల విలువ గల సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌ను ఈ రోజు వేల్పూర్‌లో ని నివాసంలో ఆయా పాఠశాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేం దుకు, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ ల్యాబ్ మెటీరియల్ ఎంతగానో ఉపయోగప డుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి గారు పేర్కొన్నారు.భీమ్ గల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు రూ. 1,46,650 విలువైన 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు.విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వియ్యంకులు దయానంద రెడ్డి ముందుకు రావడం అభినందనీయమని, విద్యా రంగానికి అయన అందిస్తున్న సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందనీ వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.ఉన్నతమైన విద్యను విద్యార్థులకు అందించడానికి ఇకముందు కూడా అవసరం ఉన్న చోట మా సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్య ప్రతినిధులు, గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిచ్కుందలో గ్రామ సంఘాల అధ్యక్షులకు శిక్షణ

సంఘాల నిర్వహణ, గ్రేడింగ్ పై అవగాహన

బిచ్కుంద, బతుకమ్మ : బిచ్కుంద మండల పరిధిలోని 28 గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లకు సోమవారం మండల కేంద్రంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంఘాల నిర్వహణ, పుస్తక నిర్వహణ, మహిళా సంఘాల బలోపేతం, గ్రామ సంఘాల గ్రేడింగ్ విధానం తదితర అంశాలపై సీనియర్ సీఆర్ పీ లు శారద శృతి వివరంగా శిక్షణ ఇచ్చారు. సంఘాలు ఎలా నిర్వహించాలి, లెక్కలు ఎలా నిర్వహించాలి, గ్రేడింగ్ లో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎలా వెళ్లాలి అనే అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. సంఘాలను పటిష్టంగా నడిపి, మహిళా సాధికారత దిశగా ముందుకు సాగాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రేష్మా బేగం, ఏపీఎం రవీందర్, అకౌంటెంట్ జబ్బార్, 28 గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.



## సిరిసిల్లలో రైతు ఆత్మహత్యాయత్నం



సిరిసిల్ల, బతుకమ్మ : సిరిసిల్ల జిల్లాలో రైతు ఒంటిపై పెట్రలో పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు గమనించి రైతును ఆత్మహత్య చేసుకోకుండా అడ్డుకున్నారు. ఈ సంఘటన సోమవారం జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వ్యవసాయ కాలేజీ పేరుతో తంగళ్లపల్లిలో 2022లో దళితులకు చెందిన 40 ఎకరాల భూములను అప్పటి మంత్రి కేటీఆర్ కేటాయించారు. అక్కడ భూమి కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి ఇప్పిస్తానని మోసం చేశారని తంగళ్ళపల్లికి చెందిన వినోద్ అనే దళిత రైతు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఆనాడు ప్రత్యామ్నాయ భూమి కానీ లేకపోతే వ్యవసాయ కళాశాల కోసం సేకరించిన మిగులు భూమిని బాధితులకు కేటాయించకుండా కేటీఆర్ తన అనుచరులకు కేటాయించారని ఆరోపించారు. ఏళ్లు గడిచినా భూమి చూపించకుండా కేటీఆర్, అప్పటి అధికారులు తప్పించుకున్నారని తెలిపారు. తన చావుకు కేటీఆరే కారణమంటూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు వినోద్ తెలిపారు. తనకు కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# బిచ్కుంద రైతు సేవా సహకార సంఘంలో 61వ మహాజన సభ





### లావాదేవీలు, ఆడిట్ నివేదికలకు ఆమోదం

### రైతులకు కెసీసీ రుణాల పునరుద్ధరణకు నిర్ణయం

బిచ్కుంద, బతుకమ్మ : బిచ్కుంద పట్టణంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో సంఘం 61వ మహాజన సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు నల్చార్ బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సంఘం పరిధిలోని రైతులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజర య్యారు.సమావేశం ప్రారంభంలో సీఈవో శ్రవణ్ సంఘం కార్యకలాపాలను, ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని సభ్యులకు వివరించారు. అనంతరం పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.లా వాదేవీల ఆమోదం ఏప్రిల్ 2026 నుండి సెప్టెంబర్ 2026 వరకు సంఘంలో జరిగిన అన్ని రకాల లావాదేవీలు, జమా-ఖర్చులు, ఎరు వులు, విత్తనాల పంపిణీ, రుణాల వివరాలను సభ్యుల ముందు ఉంచగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆడిట్ నివేదిక ఆమోదం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ అయిన నివేదికను సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. సంఘం లాభనష్టాలు, ఆడిట్ అభ్యంతరాలు లేకుండా పారదర్శకంగా నిర్వహణ జరిగిందని తెలిపారు.

కసీసీ రుణాల పునరుద్ధరణ రైతులకు ఎంతగానో ఉపయోగపడే కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసీసీ) పథకం కింద, గతంలో నిలిచిపోయిన కెసీసీ ఖాతాలను ఎస్ బిఐ బ్రాంచ్ బిచ్కుంద ద్వారా తిరిగి పునఃప్రారంభిం చాలని, అలాగే అర్హులైన కొత్త రైతులకు కొత్త కెసీసీ ఖాతాలను మంజూరు చేయాలని తీర్మానించారు. ఈ నిర్ణయంతో రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందుతాయని పేర్కొన్నారు.

సహకార ఎన్నికల నిర్వహణ సంఘం బైలా (నియమావళి) ప్రకారం, గడువు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో సహకార సంఘం ఎన్నికలను నిర్వహించాలని కోరుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నల్చార్ బాలాజీ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే లక్ష్యంగా సంఘం పనిచేస్తుందని, రైతులకు అవసరమైన ప్రతి సేవను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ యాదరావు, డైరెక్టర్లు దర్నాల్ సంజు, పోతుల అశోక్, శంకర్ నాయక్, చంద్రకాంత్ పటేల్, గణపతి రెడ్డి, సీఈవో శ్రవణ్, సంఘం సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో మోదీ జ్ఞానేశ్వర్ కుమార్ ల దిష్టిబొమ్మల దగ్ధం

### కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బ్లాక్ టీషర్టులతో నిరసన

కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ ల దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐసీసీ ఆదేశాల మేరకు బ్లాక్ షర్టు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి ఓటు హక్కు పరిరక్షణ, ఓటర్ల జాబితాలో పారదర్శకత, సర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్,రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇలియాస్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






# ఎస్ఐఆర్ ను రద్దు చేసి అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

### చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఎస్ఐఆర్ ను రద్దు చేసి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని మాజీ తొలి మేయర్ ధర్మపురి సంజయ్ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ)జ్ఞానేశ్ కుమార్ తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ నాయకత్వంలో సోమవారం శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ చౌక్ నుండి ప్రారంభమై బస్టాండ్ వరకు సాగింది. ముందుగా ధర్మపురి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మపురి సంజయ్ మాట్లాడుతూ డి.సంజయ్ గా ఉన్న పేరును ధర్మపురి సంజయ్ గా రాసినందుకు తొలి మేయర్ అయిన తనకే నోటీసులు పంపించారని గుర్తు చేశారు. మాలాంటి వారికి నోటీసులు ఇస్తున్నారంటే మిగతా వాళ్ళ పరిస్థితి ఏంటి అని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ఓట్లు కొల్లగొట్టడమే ఏజెండాగా పని చేస్తుందన్నారు. వారికి నచ్చిన వారిని మాత్రమే ఓట్లు వచ్చేలా మిగితా వారి ఓట్లు గల్లంత్తు ఎలా చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓటు హక్కు కల్పించాం. ఎస్ఐఆర్ ను రద్దు చేసి అర్హులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈవీఎం తొలగించి పాత పద్ధతి ప్రకారం ఓటింగ్ జరిపించాలన్నారు. బీజేపీ చేసిన కుట్రను తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల కమిషనర్ గా ఉంటూ బిజెపి తొత్తుగా మారిన జ్ఞానేష్ కుమార్ ను రాజీనామా చేయాలని,?చేసే వరకు కాంగ్రెస్ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. ఈ శాంతియుత ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# స్వయం సహాయక సంఘాల మహిళలకు అక్షరాభ్యాస పరీక్షలు

### ఏర్గట్ల మండలంలో ఐకెపి ఏపీఎం కుంట గంగాధర్

ఏర్గట్ల,బతుకమ్మ: కేంద్ర వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా స్వ యం సహాయక సంఘాల మహిళలకు అక్షరాస్యత పెంపొం దించాలని లక్ష్యంతో అమ్మకు అక్షరమాల పేరుతో ప్రత్యేక పరీక్ష నిర్వహించినట్లు మండల ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు 715 మంది మహిళలు అమ్మకు అక్షరమాల పరీక్షకు హాజరై నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచులు వివిధ శాఖల అధికారులు పర్యవేక్షిం చారు. రాష్ట్రవ్యాప్తంగా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఐఏఎస్ ఆదేశాల మేరకు జిల్లా డిఆర్డిఏ పిడి సాయన్న నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని ఐకెపి ఆధ్వర్యంలో చేపట్టినట్లు ఏపీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,ఐకెపి సిసి రవికుమార్,వివోఏ లు మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.





# సృజనాత్మకతకు నిలువుటద్దం వ్యాసరచన పోటీలు

వేల్పూర్, బతుకమ్మ : వేల్పూర్ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు సోమవారం శ్రీ గోవిందగిరి స్వామి దివ్య యోగాశ్రమంలో తెలుగు, ఆంగ్లం,?హిందీ భాషల్లో "కృతజ్ఞత" అనే అంశంపై వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు,శ్రీ గోవింద గిరి స్వామి శిష్యుడు శ్రీ రాఘవేంద్ర స్వామి జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తదనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మాట్లాడుతూ వ్యాసరచన పోటీలు విద్యార్థుల సృజనాత్మకతకు నిలువుటద్దమని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయిరాం బాలరాజ్, గడ్డం మల్లేష్, కొండ అశోక్ గౌడ్, మహేందర్, సహాయకులు కంకణాల రాజేశ్వర్, తీగల రఘు, వేంపల్లి చంద్రశేఖర్ గౌడ్, కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ పిల్లమారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు మహేష్, శిరీష్, ప్రత్యూష, భారతి, ఆశ్రమ సేవకులు, మాతలు తదితరులు పాల్గొన్నారు



### భగత్ సింగ్ ఆశయాలతో డ్రగ్స్ కు వ్యతిరేకంగా

# విద్యారంగ పరిరక్షణ కోసం పోరాడాలి

### ఏఐఎస్ఏ జిల్లా కన్వీనర్ జీవిఎం విఠల్

కామారెడ్డి, బతుకమ్మ : యువతను మత్తు పదార్థాల వైపు నెట్టే పరిస్థితులకు వ్యతిరేకంగా విద్యార్థులు??యువత ఐక్యంగా పోరాడాలని ఏఐఎస్ఏ జిల్లా కన్వీనర్ జీవిఎం విఠల్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి పురస్కరించుకుని?ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల ప్రభావం విద్యార్థులు, యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, క్రీడా వసతులు, గ్రంథాలయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్‌షిప్‌లు,?ఫీజు రీయింబర్స్ మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ , అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఇన్చార్జ్ అర్బన్, నాయకులు రాజు, మధు, మనోజ్, సాయి, అక్షయ, అనిత విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మ

29 సెప్టెంబర్ 2026 మంగళవారం

# షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన నివాసం

## తండ్రి, కొడుకుకు గాయాలు




నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నగరంలోని పూలాంగ్ సమీపంలోని హనుమాన్ నగర్ లో ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ తో నివాసం దగ్ధమైంది. దీంతో ఇళ్లంతా దట్టమైన పోగలు కమ్ముకోవడంతో గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో తండ్రి, కొడుకుకు గాయలైనట్లు తెలిసింది. వారికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

# ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు

బీర్కూర్, బతుకమ్మ :బీర్కూర్ మండల కేంద్రంలో గల భగత్ సింగ్ చౌరస్తాలో భగత్ సింగ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ, పీడీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ లు మాట్లాడుతూ కామ్రేడ్ భగత్ సింగ్ చిన్న వయస్సు నుండే ఈ భారతదేశనికి స్వాతంత్రం కావాలని కోరుకున్నాడని, అందులో భాగంగానే బ్రిటిష్ వల్లని తరిమికొట్టడంలో ముందుండి పోరాడిన వీరుడన్నారు. తాను 7 ఏళ్ల వయస్సు నుండి 23 ఏళ్ల వరకు అనేక పోరాటాలు జరిపాడని, ఆయన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ఇలాంటి వీరులను దేశ యువత ఆదర్శంగా తీసుకొని దేశంలో జరుగుతున్న అన్యాయాలపై ముందుండి పోరాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు నిర్ణయాలపై, జెంజి తరహా ఉద్యమాలను నిర్వహించి ప్రభుత్వల మెడలు వంచేలా ఉండాలని యువతకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత కోర్రి శివకుమార్, వడ్ల చంద్రకాంత్, బాలకృష్ణ, వడ్ల బసవరాజు, చామకురా రాజు, నారం శేఖర్, అరిగే నరేష్, షేక్ సమీర్, కుర్రి కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.



# సహకార సంఘం విండో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు మా గ్రామాలకే కేటాయించాలి...

రుద్రూర్, బతుకమ్మ : రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలో అత్యధిక సభ్యులు ఉన్న రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతో పాటు 6 డైరెక్టర్ పదవులు రాయకుర్, రాయకుర్ క్యాంప్ గ్రామాలకే కేటాయించాలని రాయకూర్ విండో చైర్మన్ సంగమేశ్వర్ రావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు గ్రామస్తులు డిమాండ్ చేస్తూ సహకార సంఘంలో తీర్మానం చేసినట్లు సంఘ సభ్యులు తెలియజేశారు. సోమవారం రాయకూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంఘ సభ్యులు, డైరెక్టర్లు, విండో చైర్మన్ సంగమేశ్వర రావు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాయకూర్, రాయకూర్ క్యాంప్ గ్రామాలలో 372, సులేమాన్ నగర్, రాణంపల్లిలో 203, చిక్కడపల్లిలో 77 మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ సభ్యులను దృష్టిలో ఉంచుకుని అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు 6 డైరెక్టర్ పదవులు రాయకూర్, రాయకూర్ క్యాంపు గ్రామాలకే కేటాయించాలని తీర్మానించినట్లు వారు తెలియజేశారు. సంఘంలో తీర్మానించిన తీర్మానాలను శాసనసభ్యులకు, జిల్లా అధికారులకు పంపనున్నట్లు వారు తెలిపారు.



# రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి**

**దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు**

**రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీ.ఎస్ సమీక్ష**






హైదరాబాద్, బతుకమ్మ : రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యా సంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతోసోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, మెరుగైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లు /కళాశాలలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేస్తూ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటు చేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు ఎక్కడ కూడా చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా?ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించివాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు.రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు??మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు,?గురుకుల పాఠశాలలు,?కళాశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడ కూడా కలుషిత ఆహారం??పాముకాటు వంటి ఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల పర్యవేక్షణ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల జాబితా ప్రక్రియలో తహసిల్దార్ నిర్లక్ష్య ధోరణి..

- లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్న తహసిల్దార్...
- అసలైన అర్హులకే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి...
- తహసిల్దార్ వక్రబుద్ధిని మానుకోవాలి...
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి...
- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్ డిమాండ్...



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల జాబితా ప్రక్రియలో తహసిల్దార్ నిర్లక్ష్య ధోరణి వహిస్తుందని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పారదర్శకంగా నిర్వహించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియ విషయంపై ఈనెల 21వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ ఏర్పాటు చేశారని, ఈ గ్రామ సభలో గ్రామస్తుల సూచనల మేరకు 22వ తేదీన కుల సంఘాల ద్వారా తీసుకున్న అర్హుల లిస్టును తహసీల్దార్ కు అందించడం జరిగిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కొరకు మొత్తం 599 దరఖాస్తులు వచ్చాయని, మూడు రోజుల క్రితం తహసిలార్ 287 మంది అర్హుల లిస్టును ప్రచురించడిం జరిగిందని పేర్కొన్నారు. అయితే ఈ లిస్టులో అనర్హుల పేర్లు కూడా వచ్చాయని, ఈ విషయంపై పాలకవర్గం తహసీల్దార్ దగ్గరికి వెల్లి 287 మంది లబ్దిదారుల లిస్టును ఏవరు ప్రచురించారని అడిగితే తహసిలార్ పొంతన లేని సమాధానం చెబుతున్నారని అన్నారు. అలాగే 150 మంది లబ్దిదారుల మరొక లిస్టు ఉందని, అదేవిధంగా ఈరోజు మళ్లీ నా2 లిస్టు కూడా తయారు చేయడం జరిగిందన్నారు. ఈ విధంగా డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారుల అర్హుల జాబితాలో తహసిలార్ నిర్లక్ష్య ధోరణి వహిస్తూ లబ్దిదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని వివరించారు. అలాగే 599మంది లబ్ధిదారుల దరఖాస్తుల్లో ఎంతమంది అర్హుల లిస్టు తయారు చేశారు. అనర్హుల సంఖ్య ఎంతమంది ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో తహసిలార్ ఒక పద్దతి ద్వారా ప్రభుత్వ ఆదేశానుసారం ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకుంటే మూడు రోజుల్లోగా అర్హుల లిస్టును తయారు చేసి డ్రా పద్ధతిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించకపోతే పార్టీ పెద్దల అనుమతితో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లబ్దిదారుల కోసం తహసిలార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు మెంబర్లు ఆమంద్ వెంకటేష్, పార్టీ నాయకులు కర్క అశోక్, కాసుల మహేష్, వడ్ల నరేష్, ప్రవీణ్, గాండ్ల శ్రీనివాస్, ఫుర్ఖన్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తడపాకల్‌లో విజిపిపి ప్రణాళిక రూపకల్పన కార్యక్రమం

## సర్పంచ్ జింక స్వప్న అనిల్ కుమార్



ఏర్గట్ల,బతుకమ్మ:మండలం తడపాకల్ గ్రామంలో వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (విజీపిపి) ప్రణాళిక రూపకల్పన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించడం జరిగింది.గ్రామంలోని ప్రస్తుత పరిస్థితులు,మౌలిక వసతులు,ప్రజల అవసరాలను సమగ్రంగా గుర్తించి,భవిష్యత్ అభివృద్ధి పనులకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని,తడపాకల్ సర్పంచ్ జింక స్వప్న అనిల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సామాజిక చిత్ర పటం, మౌలిక వనరుల చిత్ర పటం రూపొందించి,గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తించి,అలాగే గ్రామానికి అత్యవసరంగా అవసరమైన,ప్రాధాన్యత కలిగిన భవిష్యత్ అభివృద్ధి పనులను ప్రజల అభిప్రాయాల ఆధారంగా గుర్తించి ప్రణాళికలో పొందుపరచడం జరిగిందని తెలిపారు ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని,నీటి సంరక్షణ,సహజ వనరుల పరిరక్షణ,ఉపాధి అవకాశాల పెంపు తదితర అంశాలపై చర్చించి వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు,గ్రామస్థాయిలో చేపట్టాల్సిన పనులను కూడా ప్రణాళికలో చేర్చడం జరిగింది.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ,ప్రజల అవసరాలు--ప్రజల అభిప్రాయాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం ఈ కార్యక్రమంలో ప్రధాన అంశంగా నిలిచింది.ఇట్టికార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జింక స్వప్న అనిల్ కుమార్,ఉప సర్పంచ్ లోలపు రాజు,టెక్నికల్ అసిస్టెంట్,పంచాయతీ సెక్రటరీ రాకేష్,ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్,మహిళా సంఘాల అధ్యక్షురాళు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, గ్రామపంచాయతీ కారోబార్ హన్మండ్లు,మహిళా సంఘాల సభ్యులు,గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణను కొనుగోలు కేంద్రాల ద్వారా అక్టోబర్ 1వ తేదీ నుండి చేపట్టనున్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలలో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ధాన్యం సేకరణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులకు ఏ దశలోనూ ఇబ్బందులు ఎదురుకాకూడదని కలెక్టర్ సూచించారు. ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించామని, తదనుగుణంగా ప్రణాళికాబద్ధంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగేలా అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని అన్నారు. సకాలంలో డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ మెషీన్లు వంటి సదుపాయాలు సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గిడ్డంగులు, ఫంక్షన్ హాళ్లు, ఆయా ప్రదేశాలను క్షేత్రస్థాయిలో గుర్తించడం జరిగిందని అన్నారు. వీటితో పాటు డిఫాల్ట్ జాబితాలో లేని రైస్ మిల్లులకు సైతం ధాన్యం కేటాయించేలా ప్రభుత్వం తాజాగా అనుమతించిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హమాలీల కొరత తలెత్తకుండా, ధాన్యం రవాణా సకాలంలో జరిగేలా సరిపడా సంఖ్యలో లారీలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీ.పీ.ఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్ధారించిన 7 రకాల సన్నాలను పక్కాగా గుర్తించేలా సంబంధిత అధికారులకు, వాలంటీర్లకు తగిన శిక్షణ అందించాలని అన్నారు. ఇతర ప్రాంతాల నుండి జిల్లాకు అక్రమంగా ధాన్యం రవాణా జరగకుండా సరిహద్దులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు జిల్లా యంత్రాంగం దృష్టికి తెచ్చేలా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి డీసీఓ శ్రీనివాస్ రావు మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగుబాయి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సహాయ ప్రాజెక్టు అధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నూతన చట్టాలపై షీ టీం అవగాహన...

### బాలికల వేధింపులపై వెంటనే షీ టీంకు సమాచారం ఇవ్వాలి...

రెంజల్, బతుకమ్మ : మండలంలోని ధూపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు నూతన చట్టాలు, మహిళలు మరియు బాలికల రక్షణ, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెంజల్ ఎస్సై గంగాధర్ మాట్లాడుతూ.. బాలికలపై జరిగే వేధింపులు, అసభ్యకరమైన కామెంట్లు, ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలను అరికట్టేందుకు షీ టీం అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే షీ టీంకు సమాచారం అందించాలని సూచించారు. మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, సెల్‌ఫోన్లను అనవసరంగా వినియోగించకుండా చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం షీ టీం లీడర్ ఆశన్న మాట్లాడుతూ.. పోకిరీల వేధింపులు, ఈవ్‌టీజింగ్ లేదా ఇతర అసభ్యకర ప్రవర్తన ఎదురైనప్పుడు వెంటనే షీ టీం దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు షీ టీం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉపయోగ కరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన రెంజల్ ఎస్సై గంగాధర్, షీ టీం లీడర్ ఆశన్నకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెంజల్ ఎస్సై గంగాధర్, షీ టీం లీడర్ ఆశన్న, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మాధవ రెడ్డి, పి ఆర్ టీ యు మండల అధ్యక్షులు టి. సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు బి. వెంకటలక్ష్మి, కృష్ణ, రాజ్యలక్ష్మి, రాధా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఇందూరు మదర్‌హుడ్ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలి

### ప్రజావాణిలో ఆర్ఎస్‌పీ ఫిర్యాదు

ఇందూర్, బతుకమ్మ : అధిక బిల్లులు వసూలు చేసి, ప్రసూతి మహిళను ఇబ్బందులకు గురిచేసిన ఇందూరు మదర్‌హుడ్ ఆసుపత్రిపై సమగ్ర విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ పీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాధితురాలు కమ్మరి అఖిలతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ బాన్సువాడకు చెందిన కమ్మరి అఖిలకు పురిటి నొప్పులు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రైవేట్ అంబులెన్స్ లో బయలుదేరారని తెలిపారు. మార్గమధ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండరని చెప్పి అంబులెన్స్ డ్రైవర్ నరేష్ ఇందూరు మదర్‌హుడ్ ఆసుపత్రిలో కేవలం రూ.30 వేలలోనే సిజేరియన్ డెలివరీ చేయిస్తామని నమ్మించారని అన్నారు. అయితే చికిత్స అనంతరం రూ.85 వేల భారీ బిల్లు వసూలు చేశారని, అంత మొత్తం చెల్లించలేమని చెప్పడంతో ఆసుపత్రి యాజమాన్యం గర్భిణి మహిళను అవమానించి ఆసుపత్రి బయట నిలబెట్టి డబ్బులు చెల్లించే వరకు పుట్టిన పాపను అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఇందూరు మదర్‌హుడ్ ఆసుపత్రిపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ చర్యల్లో జాప్యం జరుగుతోందని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని కటారి రాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు కమ్మరి అఖిల, మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కే. లావణ్య, భారతి తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు ప్రజావాణికి 36 ఫిర్యాదులు

### ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 36 ఫిర్యాదులు అందాయి. అర్జీలను స్వీకరించిన సీపీ వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్ఐ, సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని సీపీ తెలిపారు.



# కల్లు ప్యాకెట్లపై తయారీ పదార్థాలు తప్పనిసరిగా ముద్రించాలి

### అబ్కారి శాఖకు ఆర్ఎస్ పీ జిల్లా కమిటీ ఫిర్యాదు

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : కల్లు దుకాణాల్లో విక్రయిస్తున్న కల్లు ప్యాకెట్లపై వాటిలో ఉపయోగించే పదార్థాలు, వాటి మోతాదులు, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ తప్పనిసరిగా ముద్రించాలని కోరుతూ రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అబ్కారి శాఖ ఎస్‌హెచ్‌ఓ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్ఎస్ పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కల్లు డిపోలు, దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా కల్లు ప్యాకెట్లను విక్రయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినప్పటికీ కొన్ని చోట్ల ప్లాస్టిక్ ప్యాకెట్లను ఉపయోగిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్నారు. కల్లు ప్యాకెట్లపై కేవలం డిపో పేర్లు మాత్రమే ముద్రించి విక్రయిస్తున్నారని, అందులో ఉపయోగించే పదార్థాలు, వాటి పరిమాణం, ఆల్కహాల్ శాతం, చక్కెర శాతం ఎంత అనే వివరాలను ప్రజలకు తెలియజేయడం లేదని పేర్కొన్నారు. దీనివల్ల వినియోగదారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అబ్కారి అధికారులు కల్లు డిపోలు, దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కల్లు ప్యాకెట్‌పై ఆల్కహాల్ శాతం, ఉపయోగించిన పదార్థాల వివరాలు, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీతో పాటు మద్యపానం ఆరోగ్యానికి హానికరం?అనే హెచ్చరిక తప్పనిసరిగా ముద్రించాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత

### ట్రాక్టర్ డ్రైవర్, ట్రాక్టర్ పై కేసు నమోదు

భీమ్ గల్, బతుకమ్మ :భీమ్ గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్, ట్రాక్టర్ డ్రైవర్ పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సి. హెచ్ తిరుపతి తెలిపారు. సంఘటన వివరాల్లోకి వెళ్తే 28 న ఉదయం సుమారు 07:30 గంటల సమయంలో భీమ్ గల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బెజ్జొరా బైపాస్ రోడ్డులో ఇసుకతో అనుమానస్పదంగా వస్తున్న ఒక జాన్ డీర్ ట్రాక్టర్ నంబర్ ాూ15ధీూ1423 ను పట్టుకొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ సూర రాకేష్ ను పోలీసులు విచారించి, రాజారం నగర్ కాలనీ, భీంగల్ మండల కేంద్ర వాసిగా గుర్తించారు. అనుమతి లేకుండా ఇసుకతో ఉన్న ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి డ్రైవర్‌పై, ట్రాక్టర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



# ఇచ్చిన హామీ మేరకు లబ్దిదారులకు తులం బంగారం ఇవ్వాలి.

### మంజూరు కోసం సిద్ధంగా ఉన్న 255 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఫైళ్లపై సంతకాలు

### అన్ని మండలాల తహసీల్దార్ల సమక్షంలో ఫైళ్ల పరిశీలన

### ఫైల్స్ పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన ప్రభుత్వానికి పంపించాలి.

వేల్పూర్, బతుకమ్మ: గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించడాని కోసం రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కళ్యాణ లక్ష్మి, శాదిముభారాఖ్ లబ్దిదారులకు లక్ష నగదుతో పాటు తులం బంగారం ఇవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్యే తన నివాసం లో మంజూరుకు సిద్ధంగా ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు సంబంధించిన మొత్తం 255 బ్యాచ్ ఫైళ్లను పరిశీలించి, ఆయా మండలాల తహసీల్దార్ల సమక్షంలో ఫైళ్లపై ఆయన సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఫైల్స్‌ను తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉంచకుండా, త్వరితగతిన పరిశీలించి సంతకాలు తీసుకొని ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధి పొందిన వారందరికీ, అలాగే



నూతనంగా మంజూరు కాబోయే లబ్ధిదారులందరికీ రూ.1 లక్ష చెక్కుతో పాటు తులం బంగారం అందించాలన్నారు.



# కేర్ కాలేజీలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :కేరి డిగ్రీ కాలేజీలో  నూతన విద్యార్థులు ఆహ్వానిస్తూ ఫ్రెషర్స్ పార్టీ సెలబ్రేషన్స్ వేడుకగా నిర్వహించారు.... మొదటి సంవత్సరం విద్యార్థుల ఆహ్వానిస్తూ ద్వితీయ, తృతీయ సంవత్సరము విద్యార్థులు సోమవారం ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ .... విద్యను అభ్యసించేది, విద్యాలయాల్లో ఉండేది కేవలం భారతీయులు మాత్రమేనని మతాలకు మత విద్వేషాలకు చోటు లేదని అన్నారు. విద్యార్థులు చదువు పైన మరింత శ్రద్ధ పెట్టి విద్యాబుద్ధులు సంపాదించి దేశానికి పేరు తెచ్చే విధంగా ఉన్నతమైన సంస్కార విద్యార్థులుగా తయారు కావాలని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల డాన్స్ లతో జోష్ నింపారు. అట, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కేర్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్ నరాల సుధాకర్ తో పాటు ప్రిన్సిపల్ గోరంట్యాల నరేష్, వైస్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, కళాశాల బాధ్యులు కొయ్యాడ శంకర్, సందేశ్, కిరణ్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు













## ఏర్గట్లలో నషా ముక్త్ భారత్ పై విద్యార్థులతో ర్యాలీ



ఏర్గట్ల,బతుకమ్మ: విద్యార్థులు మత్తు పదార్థాలు వాడకుండా వాటి వల్ల కలిగే అనర్థాలు గూర్చి విద్యార్థులకు అవగాహన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ ర్యాలీని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్గట్ల విద్యార్థులు చేపట్టారు. దీనిలో భాగంగా  విద్యార్థులు గంజాయికి మరియు కల్తీకల్లుకు దూరంగా ఉండాలని ముఖ్యంగా గంజాయి తాగడం వల్ల అనేక రకాల ఇబ్బందులు కలుగుతాయని చిన్నతనములోనే జీవితాన్ని నాశనం చేసుకునే అలవాటును మానుకోవాలని వాటికి దూరంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు విద్యా ర్థులకు సూచించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలను ప్రతిజ్ఞ ద్వారా విద్యార్థులకు తెలియజేశారు నషా ముక్త్ ని వికసిత భారత్ ను నిర్మిం చుకునే శక్తి విద్యార్థులకు యువకులకు ఉందని ఉపాధ్యాయులు చక్కని సందే శం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, రాజ నరసయ్య,ప్రవీణ్ శర్మ,జ్యోతి,కృష్ణవేణి,రిషికా, స్కూల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేలుడు పదర్థాల చట్ట ప్రకారం ఒకరికి పదేళ్ల జైలుశిక్ష

నిజామాబాద్ లీగల్, బతుకమ్మ పేలుడు పదార్థాలు కలిగి ఉన్న నేరం రుజువు కావడంతో బూస జనార్ధన్ కు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విదిస్తూ నిజామాబాద్ నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి దారావత్ దుర్గా ప్రసాద్ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు సిరికొండ మండలం న్యావనంది గ్రామానికి చెందిన బూస జనార్ధన్, ఇతర గ్రామాలకు చెందిన పల్లికొండ గంగాధర్, అనికేష్ కమల్, ఆదిలాబాద్ కు చెందిన కొల్లూరి సాయన్న, కామారెడ్డి చిందల భూపాల్ రెడ్డి, సిరికొండ గుగులోత్ రాజు ల పై జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ లో 2022 ఏప్రిల్, 07 న నిషేధిత మావోయిస్టు పార్టీ దళాన్ని విశృతం చేయాలనే ఉద్దేశంతో జెలెటిన్స్ తదితర పేలుడు పదార్థాలు తీసుకువెలుతుండగా కొలిప్యాక గ్రామ శివారులోని శ్రీవేంకటేశ్వర ఆలయం వద్ద అదుపులోకి తీసుకుని విచారణ చేయగా మావోయిస్టు పార్టీని బలోపేతం చేయడానికి వీలుగా కార్యకలాపాలు చేస్తున్నామని వారు తెలిపినట్లు పేర్కొన్నారు. అందరిని అరెస్ట్ చేసిన నేర విచారణ పూర్తి చేసి పోలీసులు చార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేశారు. చార్జ్ షీట్ అదారంగా నేర న్యాయ విచారణ జరిపిన జడ్జి దుర్గా ప్రసాద్ ప్రధాన ముద్దాయి జనార్ధన్ పై నేర అభియోగాలు రుజువు అయినట్లు నిర్ధారిస్తూ పేలుడు పదార్తాల చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం పది సంవత్సరాల కఠిన జైలుశిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించారు. మిగతా ముద్దాయిలపై నేరం రుజువు కానందున నిర్దోషులుగా ప్రకటించారు.

## యువత గుండెల్లో రగిలిన భగత్ సింగ్ విప్లవ జ్వాల

**సిరికొండలో CPI(ML) మాస్ లైన్ ఆధ్వర్యంలో 119వ జయంతి వేడుకలు**

**భగత్ సింగ్ త్యాగం, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు పోరాడాలి.**

**ఈ దేశంలో పాసిజనీ తరిమికొట్టాలి.**

**సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సిరికొండ ధర్పల్లి సంయుక్త మండల కార్యదర్శి ఆర్ రమేష్ లిపిలుపు**

సిరికొండ,బతుకమ్మ  : "ఇంక్విలాబ్ జిందాబాద్" అనే నినాదం నేటికీ యువతలో స్ఫూర్తిని నింపుతూనే ఉందని  సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సిరికొండ ధర్పల్లి సంయుక్త మండల కార్యదర్శి ఆర్ రమేష్ పిలుపును ఇచ్చారు అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి, దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా సిరికొండ మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సిరికొండ ధర్పల్లి సంయుక్త మండల కమిటీ     ఆధ్వర్యంలో సోమవారం నాడు ఘనంగా వేడుకలు నిర్వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటానికి పీడీఎస్‌యూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థుల నినాదాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూలి భగత్ సింగ్ కేవలం ఒక స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, యువతలో విప్లవ చైతన్యాన్ని రగిలించిన స్ఫూర్తిదాయక వ్యక్తి అని అన్నారు. బ్రిటీష్ పాలనలోని అణచివేతకు వ్యతిరేకంగా చిన్న వయసులోనే ఉద్యమ బాట పట్టి, దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. ఉరి త్రాడును ముద్దాడిన యువకిషోరం అన్నారు. కేంద్ర శాసనసభలో భగత్ సింగ్ బాంబు విసిరిన ఘటనను ప్రస్తావిస్తూ.. అది ప్రాణనష్టం




కలిగించాలనే ఉద్దేశంతో కాకుండా, బ్రిటీష్ ప్రభుత్వానికి నిరసన స్వరం వినిపించాలనే ఉద్దేశంతో జరిగిన చర్యగా వక్తలు వివరించారు. ఈ కళాశాల ఉపాధ్యాయురాలు ప్రవలిక ప్రసంగించగా, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, మండల నాయకులు ఎస్ కిశోర్, ఎస్ కె సాధుల్లా, ఆర్ సిద్ధు, కళాశాల ఉపాధ్యాయురాలు ప్రవలిక కార్యక్రమంలో  తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలపై వార్తలు రాసే జర్నలిస్ట్‌పై కేసుల..

**బస్వరాజ్‌కు అండగా ఉంటాం**

**రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా?**

**మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి**

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :జర్నలిస్ట్ బస్వరాజ్‌పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. బస్వరాజ్‌కు తాము అండగా ఉంటామని తెలిపారు. ఆయనపై దాడి జరిగినట్లు వైద్యులు నిర్ధారించారని పేర్కొంటూ, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలపై వార్తలు రాసే జర్నలిస్టులపై కేసులు, దాడులు చేయడం సరికాదన్నారు. ఒకేసారి సుమారు 20 మంది



జర్నలిస్టులపై కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. కిడ్నాప్‌లు, అత్యాచారాలు, హత్యలు వంటి తీవ్రమైన నేరాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఏమేరకు స్పందిస్తున్నారని ప్రశ్నించారు. గంజాయి విక్రయాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం



ఉందన్నారు. రాజకీయ నాయకులపై కూడా చట్టం సమానంగా అమలు కావాలని జీవన్‌రెడ్డి అన్నారు. నాలుగో స్థంభంగా భావించే జర్నలిస్టులపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు. పోలీసుల తీరుపై మరింత అధ్యయనం చేసి, పూర్తి వివరాలతో మరోసారి ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు రక్షణ లేదని ఆయన విమర్శించారు.